క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



శ్రీధర్‌బాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ, కాంగ్రెస్ నాయకులు

సోన్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐటీ, పరిశ్రమ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం కడెం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద ఆయనకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల, జిల్లా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఘన స్వాగతం పలికారు. నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గాండ్రత్ ఈశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మోహినోద్దిన్, రాజనర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లయ్య పాల్గొన్నారు.

'గిరిజన సింహగర్జనకు తరలిరావాలి'

ఖానాపూర్: సేవాలాల్ సేన పదో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన గిరిజన సింహగర్జన జయప్రదం చేయాలని నాయకులు కోరారు. సోమవారం మండలంలోని బావాపూర్(ఆర్) తండాలో పోస్టర్ ఆవిష్కరించారు. గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ వినీశ్, నాయకులు రామారావు, దశరథ్ తదితరులు ఉన్నారు.

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'

కుంటాల: అధికారిక సమావేశంలో బీజేపీ నాయకులను వేదికపై కూర్చోబెట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కుంటాల మాజీ సర్పంచ్ దొనికెన సమత వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం కుంటాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో మాజీ ప్రజాప్రతినిధులు అధికారిక సమావేశంలో పాల్గొని అధికారులను ప్రశ్నించడం విడ్డూరమన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయంలో పూజలు

ముథోల్: మండల కేంద్రం ముథోల్‌లోని జటశంకర ఆలయంలో సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. వెంకటేశ్‌గౌడ్, అంజిగౌడ్, సాయిబాబాగౌడ్, కార్తీక్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, దేవేందర్‌గౌడ్ ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని డొంగుర్‌గాం గ్రామ సిద్దేశ్వర ఆలయం, టెంబుర్ని గ్రామ శ్రీచక్ర లింగేశ్వర స్వామి ఆలయాల్లో శ్రావణమాస చివరి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు బూరుగుపల్లి (కే) గ్రామానికి చెందిన జాదవ్ మోతీలాల్, దిలావర్‌పూర్ మండల మాజీ జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి అన్నదానం చేశారు. గోంద్ర సాగర్ పటేల్, షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో భక్తి పాటలు, తబలా వాయిద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఘనంగా లక్ష బిల్వార్చన

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గల అన్నపూర్ణ మహదేవాలయంలో సోమవారం లక్షబిల్వార్చన కార్యక్రమం జరిగింది. సోమవారం ప్రత్యేక పూజల మధ్య లక్షపత్రి పూజ కార్యక్రమాన్ని పండితులు కీర్తి రాఘవశర్మ, రాజశేఖర్‌శర్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేపట్టారు. జనార్దన్, కిషన్, కిషోర్, రాజశేఖర్, అనిల్, వెంకటేశ్, రాజు, జనార్దన్, పుప్పాల రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

హాస్టల్‌లో నాగుపాము కలకలం

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలోని హాస్టల్‌లో సోమవారం నాగుపాము కలకలం రేపింది. మధ్యాహ్న సమయంలో హాస్టల్‌లో కరెంటు పోగా, హాస్టల్ పక్కనే ఉన్న సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఆనంద్‌ను పిలిపించారు. ఫ్యూజు మార్చేందుకు ప్యానెల్ బోర్డును చూడగా నాగుపాము కనిపించింది. దీంతో విద్యార్థులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. సిబ్బంది కుంటాల గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా.. గ్రామానికి చెందిన ముత్యం వచ్చి పామును హతమార్చడంతో విద్యార్థులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా ఉర్సు

భైంసాటౌన్: పట్టణంలో సోమవారం ముస్లింలు ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు షేక్ ఉద్దాన్‌షా వలీ ఆధ్వర్యంలో స్థానిక మదీనాకాలనీ నుంచి చాదర్, జెండాలతో భారీ ఎత్తున ఊరేగింపుగా తరలివెళ్లారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహ్మద్ మజరుద్దీన్ ఖాద్రి, మహ్మద్ సలావుద్దీన్ ఖాద్రి, మహ్మద్ ఆరీఫుద్దీన్ ఖాద్రి, యువకులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో అలుగుపై నుంచి పారుతున్న నీరు



భైంసారూరల్: గుండేగాం గ్రామంలోకి చేరిన వర్షపు నీరు



లోకేశ్వరం: పంచగుడి వంతెన వద్ద గోదావరి ఉధృతి

భారీ వర్షంతో అతలాకుతలం

జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. భారీ వర్షంతో గ్రామాలు అతలాకుతలమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. లోలెవల్ బ్రిడ్జిలపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రోజురోజుకూ గోదావరి నదిలో నీటి ప్రవాహం పెరుగుతోంది. భారీ వర్షానికి పలు ఇళ్లు కూలిపోగా బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తడంతో సుద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఖానాపూర్ పట్టణంలోని కుమురంభీం చౌరస్తా నుంచి తర్లపాడ్ వెళ్లే మార్గంలో గాలివాన కారణంగా చెట్లు పడిపోగా, చెట్ల కొమ్మలను సీఐ సైదారావు తీయించారు. భారీ వర్షాలకు వచ్చిన వరదనీటితో గుండేగాం మళ్లీ నీటమునిగింది. సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామం సమీపంలోని సరస్వతి కెనాల్‌కు గండి పడింది. దీంతో పలువురు రైతుల పంట పొలాల్లోకి నీరు, ఇసుక మేటలు చేరాయి. సోన్ మండలం జాఫ్రపూర్ గ్రామ సమీపంలోని బ్రిడ్జి వరదల కారణంగా మునిగిపోగా నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అధికారాలతో కలిసి పరిశీలించారు. ఖానాపూర్ మండలం దిలావర్‌పూర్ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ గద్దె కూలగా ట్రాన్స్‌ఫార్మర్ కింద పడిపోయింది. కుంటాల మండలంలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దౌనెల్లి, ఓలా, సూర్యాపూర్, లింబా(బి), లింబా(కె), అందాకూర్, కల్లూరు, పెంచికల్‌పాడ్, విఠాపూర్ గ్రామాల్లో పత్తి, మిర్చి పంటలు నీట మునిగాయి.

– సాక్షి నెట్‌వర్క్



దస్తురాబాద్: కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు



కడెం: అల్లంపల్లిలో కోతకు గురైన రోడ్డు



లక్ష్మణచాంద: తిర్పెల్లి వద్ద రాకపోకలు నిలిపివేస్తున్న అధికారులు



దిలావర్‌పూర్: దెబ్బతిన్న రోడ్డు, నీటి కాలువలను పరిశీలిస్తున్న అధికారులు



లోకేశ్వరం: వర్షాలకు హావర్గలో కూలిన ఇల్లు



ఖానాపూర్: చెట్ల కొమ్మలు తొలగిస్తున్న సీఐ



నర్సాపూర్(జి): దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు



సోన్: న్యూవెల్మల్ సమీపంలో గండిపడిన సరస్వతి కెనాల్



కుంటాల: విఠాపూర్‌లో మిర్చి పంటలో చేరిన వరద నీరు



కుంటాల: దౌనెల్లి తండాలో నీటమునిగిన పత్తి పంట



పెంబి: వరద ధాటికి కొట్టుకుపోయిన వరి పంట



సోన్: బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

ఘనంగా పొలాల అమావాస్య



భైంసారూరల్: మహాగాంలో..



లోకేశ్వరం: రాజూరలో ఆలయం చుట్టూ ఎడ్లతో ప్రదక్షిణలు చేస్తున్న రైతులు

దిలావర్‌పూర్/ భైంసారూరల్/ తానూరు/ లక్ష్మణచాంద/ లోకేశ్వరం/ ముథోల్/ కుభీర్/ కుంటాల /సారంగపూర్: జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పొలాల అమావాస్యను ఘనంగా జరుపుకున్నారు. రైతులు బసవన్నలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఇంట్లో చేసిన వంటకాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఎడ్లు లేని వారు మట్టితో తయారు చేసిన ఎడ్లకు పూజలు చేశారు. పంటలు సంవృద్ధిగా పండాలని రైతులు మొక్కులు చెల్లించుకున్నారు. కాగా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 42వ రోజుకు చేరుకోగా పొలాల అమావాస్య పండుగను రైతులు దీక్షా శిబిరంలోనే జరుపుకున్నారు. పలువురు రైతులు తమ ఇళ్లలో ఎడ్ల ప్రతిమల పక్కనే ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఉన్న ప్లకార్డులు పెట్టి పూజలు నిర్వహించారు.



కుంటాల: విఠాపూర్‌లో..



ముథోల్‌లో..

గిరిజన గ్రామాల సందర్శన

మామడ: మండలంలోని గుట్టమీది గిరిజన గ్రామాలు తోటిగూడ, రాశిమెట్ల, బురదపల్లి, తాండ్ర, మొండిగుట్ట గ్రామాలను సోమవారం ఎంపీడీవో గంగాసాగర్‌రెడ్డి సందర్శించారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తానూరు: మండలంలోని కల్యాణి గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద నీరు కాలనీలోని ఇళ్లల్లోకి చేరింది. సమాచారం తెలుసుకున్న అధికారులు సోమవారం కల్యాణి గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులను అడిగి వివరాలు సేకరించారు. గుట్ట ప్రాంతం నుంచి వస్తున్న నీరు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలో చేరుతోందని, సమస్య పరిష్కరించాలని అధికారులను కోరారు. తహసీల్దార్ లింగంమూర్తి మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎస్సై సందీప్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఖానాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో వరద ప్రభావిత సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి తక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో వర్షం కారణంగా జనావాసాల్లోకి వరద నీరు వస్తుండడంతో రోడ్డు మధ్యలో పైప్ వేశారు. పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, కారోబారి ప్రసన్న తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

పార్‌పల్లిలో వైద్య శిబిరం

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పల్లిలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. గత కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలు జ్వరాల బారిన పడుతుండడంతో పార్‌పల్లి ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఈవో హరికుమార్ గౌడ్, సూపర్‌వైజర్ మతిన్, ఆరోగ్య కార్యకర్త శివక్రిష్ణ, కల్యాణి, ఆశా కార్యకర్తలు రమ, గంగామణి తదితరులు ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

సోన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని లైన్‌మెన్ గంగాధర్ అన్నారు. మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో గల బొండ గంగారాం ఇంటి గోడలకు సోమవారం విద్యుత్ సరఫరా కాగా విద్యుత్ శాఖ సిబ్బంది సరి చేశారు. లైన్‌మెన్ గంగాధర్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో గోడలు, స్లాబులు తడిసి ఉండటంతో సీలింగ్ ఫ్యాన్‌వైర్‌ల ద్వారా విద్యుత్ ప్రసరిస్తుందన్నారు. విద్యుత్ సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

గోమాతకు అంత్యక్రియలు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో సోమవారం గోవు మృతి చెందగా, గోమాతకు వీడీసీ సభ్యులు సాంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేసి అంత్యక్రియలు జరిపారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందగిరి నరేందర్, కోశాధికారిగా కందగిరి శ్రీధర్, కార్యదర్శిగా ఆనంతుల నవీన్, సంయుక్త కార్యదర్శిగా దేవరశెట్టి నవీన్‌లను ఎన్నుకున్నారు. సంఘ సభ్యులు కందగిరి మహేందర్, ప్రవీణ్, గిరిధర్, ప్రసాద్, గంగాధర్, భూషణ్‌చారి, శశిధర్, నవీన్, రాంచందర్, సదానందం, సతీశ్, గజేందర్ పాల్గొన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

లక్ష్మణచాంద: రేషన్‌కార్డు లేకుండా రుణమాఫీ కాని రైతులు వెంటనే మండల కేంద్రంలోని రైతువేదికలో దరఖాస్తు చేసుకోవాలని లక్ష్మణచాంద క్లస్టర్ ఏఈవో పవిత్ర సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డుల జిరాక్స్‌లతో రైతువేదిక వద్దకు రావాలన్నారు.

రెయిన్‌కోర్టులు పంపిణీ

ఖానాపూర్: ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల క్షేత్రస్థాయిలో పనులు చేసే మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఇబ్బందులు పడకుండా సోమవారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం రెయిన్‌కోర్టులు పంపిణీ చేశారు. వైస్‌చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు, నాయకులు కిషోర్‌నాయక్, శంకర్, సురేశ్, అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, కమిషనర్ మనోహర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వైఎస్సార్ వర్ధంతి

ఖానాపూర్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు సీహెచ్ భవాని పాల్గొన్నారు. వైఎస్సార్ చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు.

ముథోల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్సార్ వర్ధంతి పురస్కరించుకొని సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు ఘన నివాళులర్పించారు. ముథోల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు ముత్యంరెడ్డి, గంగారెడ్డి, శ్రీనివాస్, రైతులు తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనదైన పాలనతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్ పేదల కోసం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, మాజీ ఎంపీపీ రాంచందర్ రెడ్డి, శ్రీనివాస్, శరత్, నరేందర్, గంగాధర్, మతీన్ ఖాన్, సాహెబ్‌రావు, రవి తదితరులు ఉన్నారు.



భైంసాటౌన్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సోమవారం నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ సలీం, ముస్కురాజు, అబ్దుల్‌రహీం, శంకర్, లక్ష్మణ్, రాజన్న, ఫిరోజ్, అజ్మత్, సోమరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు శాంతికమిటీ సమావేశం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గల సీఎంరావు ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం శాంతికమిటీ సమావేశాన్ని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. సమావేశానికి ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, విద్యుత్ అధికారులు హాజరుకావాలని సూచించారు.

సుప్రీంకోర్టు తీర్పు పునఃపరిశీలించాలి

కడెం: ఎస్సీ వర్గీకరణ తీర్పును సుప్రీంకోర్టు పునఃపరిశీలించాలని అంబేద్కర్ సంఘ నాయకుడు ఆర్ల రమేశ్, నేతకాని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుల్లె వెంకటేశ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణపై గతంలో ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యానా, బీహార్ రాష్ట్రాల విషయంలో సుప్రీంకోర్టు వర్గీకరణ చెల్లదని తీర్పులో వె ల్లడించిన విషయం పరిగణలోకి తీసుకోకుండా ఇచ్చిన తీర్పును పునఃపరిశీలన చేయాలన్నారు. నాయకులు రాజేశ్, నర్సయ్య, లక్ష్మణ్, రాజశేఖర్, గంగారాం ఉన్నారు.

డీజీపీని కలిసిన సుభాష్‌రావు

నిర్మల్: డీజీపీగా జితేందర్‌ను జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ మెంబర్, డాక్టర్ సుభాష్‌రావు హైదరాబాద్‌లోని డీజీపీ నివాసంలో సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. జితేందర్ ఐపీఎస్ శిక్షణ పూర్తికాగానే 1995లో ఏఎస్పీగా తొలిపోస్టింగ్ నిర్మల్‌లోనే తీసుకున్నారు. అప్పుడు కుటుంబ వైద్యుడిగా ఉన్న శోభా, సుభాష్‌రావులు ఆయన ఆహ్వానం మేరకు మర్యాదపూర్వకంగా కలిశారు.



డీజీపీ జితేందర్‌తో సుభాష్‌రావు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముథోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899